పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

సనత్‌నగర్: ఇటీవల భారీ వరదలతో బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్ ముంచెత్తగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు వరదనీటిని పూర్తిగా తొలగించడంలో కీలకంగా వ్యవహరించారు. వారి సేవలను గుర్తింపుగా స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత హాసీటోచర్ ఆధ్వర్యంలో గురువారం వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నటరాజ్, యాదగిరి, నరసింహయాదవ్, సున్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్ ప్రారంభం

అమీర్‌పేట: ఆసుపత్రులకు వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించడంతోనే సగం రోగం నయమయ్యిందనే భావన వారిలో ఏర్పడుతుందని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు అన్నారు.అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో ఫీవర్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యుల సేవలు వెలకట్టలేనివని అన్నారు.కొంత మంది సంపాదనే లక్ష్యంగా పెట్టుకుని నిరుపేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

బల్కంపేట ఆర్‌యూబీ పరిశీలన



అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

అమీర్‌పేట: బల్కంపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పరిశీలించారు.వర్షం కురిసిన ప్రతిసారి బ్రిడ్జి కింద వరద నిలుస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో గురువారం పరిశీంచారు. నీరు నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీసి సంబంధిత అధికారులతో మాట్లాడారు.త్వరలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాపద్దారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

యూ టర్న్.. ఓపెన్



యూ టర్న్‌ను తెరుస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాంగోపాల్‌పేట్: ఆర్పీరోడ్‌లోని పెట్రోల్‌బంకు మూసివేసిన యూ టర్న్‌ను తెరిపించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన మాజీ మంత్రి మర్రిశశిధర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్పీరోడ్‌లోని పెట్రోల్ బంకు వద్ద ఎప్పటి నుంచో యూ టర్న్ కొనసాగుతుంది. అయితే గత నెలలో జరిగిన ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఈ యూ టర్న్‌ను ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. అయితే తాత్కాలికంగా మూసివేసిన ఈ యూటర్న్‌ను తెరవాలని స్థానికులు, వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పోలీసులను కోరగా పట్టించుకోలేదు. ఈ విషయమై మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా గురువారం మహంకాళి ట్రాఫిక్ పోలీసులు యూ టర్న్‌ను తెరిచారు.

సెప్టెంబర్ 10 నుంచి 'అల్యూమెక్స్ ఇండియా' సదస్సు

సనత్‌నగర్: అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ తయారీదారుల సంఘం (ఏఎల్ఈఎంఏఐ) ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు 'అల్యూమెక్స్ ఇండియా–2025' సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు జితేంద్ర చోప్రా తెలిపారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అల్యూమెక్స్ ఇండియా–2025 ద్వారా టెక్నాలజీ లోకలైజేషన్, గ్రీన్ ఎక్స్‌ట్రూషన్, ఎంఎస్ఎంఈ మద్దతు, గ్లోబల్ మార్కెట్ ట్రెండ్స్‌పై సెషన్లు, బిజినెస్ మ్యాచింగ్, బయ్యర్–సెల్లర్ మీట్స్ ఉంటాయని వివరించారు. దీనిలో అంతర్జాతీయ, భారతీయ దిగ్గజ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ పండరి వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్–2లో గురువారం మధ్యాహ్నం ఆగిఉన్న జనరల్ కోచ్‌లో సుమారు 55–60 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

కుమ్మిన వాన.. తప్పని మునక





బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లో పారుతున్న వరద



మైత్రివనమ్ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వరద



మొరాయించిన వాహనాలను తోస్తున్న ట్రాఫిక్ పోలీసులు



వర్షంలో తడుస్తూ వెళ్తున్న విద్యార్థులు

సనత్‌నగర్: భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ మళ్లీ నీట మునిగాయి. ప్రధాన, అంతర్గత రహదారుల్లో భారీగా వరద పారింది. బేగంపేట డివిజన్ పరిధిలోని శ్యాంలాల్‌బిల్డింగ్స్ మరోసారి ముంపునకు గురైంది. గత రెండు రోజుల క్రితం ఇక్కడి కొచ్చెర్ అపార్ట్‌మెంట్ నుంచి బేగంపేట ప్రధాన రహదారికి అవతలి వైపు ప్యాటలూమ్స్ నాలాకు నీటి ప్రవాహం సాగేందుకు రోడ్డు కిందుగా భారీ తూములు వేశారు. అయితే తూములు పూడుకుపోవడంతో గత రెండు రోజుల క్రితం జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టారు. అయితే తూతూమంత్రంగానే పనులు చేపట్టడంతో మళ్లీ శ్యాంలాల్ ఏరియాను వరద ముంచెత్తింది. బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, మయూరిమార్గ్, అల్లంతోటబావి, చీకోటిగార్డెన్స్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలు నీటమునిగాయి. ఎక్కడికక్కడ వాహనాలు బారులుదీరడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

నీట మునిగిన మైత్రీవనమ్

అమీర్‌పేట: అమీర్‌పేట మైత్రీవనం ప్రధార రహదారితో పాటు పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. మోకాళ్ల లోతు వరకు నీరు పారడంతో పలు ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. రోడ్లపై భారీగా నీరు నిల్వడంతో కార్లు, ద్విచక్ర వాహనాల లైసెన్స్‌లోకి నీరు చేరి రోడ్డుపై మొరాయించాయి.ట్రాఫిక్ పోలీసులు శ్రమించి వాహనాలను తోసుకుంటూ పక్కకు తరలించారు. అమీర్‌పేట ధరం కరం రోడ్డు,ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీహాల్ , బల్కంపేట ప్రాంతాల్లో వాహనాలు స్తంభించిపోయాయి.

లాలాపేటలో..

లాలాపేట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయమవుతున్నాయి. గురువారం గురిసిన భారీ వర్షానికి తార్నాక, లాలాపేట, శాంతినగర్ ప్రాంతాల్లో రోడ్లపై వరద పారింది. సాయంత్రం వేళ కావడంతో విద్యార్థులు తడుస్తూ ఇళ్లకు పరుగులు తీశారు. విద్యార్థులను తీసుకెళ్లే స్కూల్ వ్యాన్స్, ఆటోలు, బస్సులతో కాలనీ, బస్తీల్లో ట్రాఫిక్ జామ్‌అయింది. లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై వర్షం నీరు నిలిచింది. మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు ఏరులై పారింది.

నాలా పెండింగ్ పనులు పూర్తి చేయాలి



నాలాను పరిశీలించి అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: రెండు, మూడ్రోజుల్లో నాలా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు.నాలా నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో వర్షం కురిసిన ప్రతి సారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అమీర్‌పేట గాయత్రినగర్ ప్రజలు ఇటీవల మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. స్పందించిన ఆయన గురువారం సంబంధిత అధికారులతో కలిసి నాలాను పరిశీలించారు. నాలా నిర్మాణ పనులకు అడ్డంకిగా మారిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల షిఫ్టింగ్ పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలాపై ఉన్న ఆక్రమణలను సైతం తొలగించాలని ఆదేశించారు.ప్రతి సంవత్సరం వర్షాకాలంలో గాయత్రినగర్‌లో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు పడుతున్న కష్టాలను చూసి శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో నాలా నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట వివిధ శాఖలకు చెందిన అధికారులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్,సైయ్యద్,కిషోర్,హనుమంత్‌రావు, సంతోష్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, గోపీలాల్‌చౌహన్, నర్సింహ, బల్‌రాం, అశోక్ యాదవ్,వినోద్ ఉన్నారు.

క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సనత్‌నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్లకు తాను అన్నివిధాలుగా అండగా ఉంటానన్నారు. అందరూ ఐక్యంగా ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి బోయగూడ బరేల్ గ్రౌండ్ (గ్రేవ్‌యార్డు) అభివృద్ధికి రూ.3 కోట్లను మంజూరు చేసి అభివద్ధి పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిపివేశారని, తాను అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చిన తర్వాత తిరిగి పనులను ప్రారంభించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, జయరాజ్, విజయ్‌పాల్, విలియం, ప్రణయ్, సునీల్, దేవదాస్, జయ, సురేష్, మనోహర్, సాంసన్, పరమానందం పాల్గొన్నారు.

మిలటరీ అధికారులతో రాఖీ వేడుకలు



రాఖీ వేడుకల్లో పాల్గొన్న మిలటరీ అధికారులతో చిన్నారులు

లాలాపేట: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్‌కు చెందిన ప్రీ ప్రైమరీ విద్యార్థులు గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని బిషన్ ఈఎంఈ క్యాంప్‌ను సందర్శించారు. 654 ఈఎంఈ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అలోక్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో పిల్లలు రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. పలువురు మిలటరీ అధికారుల చేతికి చిన్నారులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ యు.పి. పాటిల్, మేజర్ రోషన్ ఝా,తక్షశిలా స్కూల్ ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ పాల్గొన్నారు.

వరద సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలి



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: వరదనీరు రోడ్లపై నిలవకుండా సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి గురువారం డివిజన్ పరిధిలోని శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లో వరద ముంపు ప్రాంతాలను సందర్శించారు. ముఖ్యంగా శ్యాంలాల్‌బిల్డింగ్స్ శ్రీవిజయ గణపతి దేవాలయం వద్ద వరద ముంపు సమస్య తలెత్తకుండా ప్యాంటలూమ్స్ వైపు ప్రధాన రహదారిలో ఉన్న తూముల్లో పూడికతీతను ఎప్పటికప్పుడు తీయాలని సూచించారు. అలాగే డ్రైనేజీ పైపులను శుభ్రం చేయడం ద్వారా సాఫీగా నీరు ప్రవహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వెల్కిన్ పార్కు అపార్ట్‌మెంట్ వద్ద కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వరద నీరు నిలవకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారులు ఆశీష్, రామేశ్వర్‌రావు, జీహెచ్ఎంసీ వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.43, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 15, క్యారెట్ 41, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇఫ్లూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లీష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో మూడు రోజుల అంతర్జాతీ ససదస్సు ప్రారంభమైంది. గురువారం ఇఫ్లూ ఆడిటోరియంలో జరిగిన ఇండిజియస్ ట్రైబల్ కమ్యూనిటిస్ రిఫ్రేమింగ్ రీసెర్చ్ మెథడాలజీస్ అనే అంశం జరిగే సదస్సుకు వీసీ ప్రొ.నాగరాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఆదివాసీల జీవిత విధానంపై పరిశోధనలు జరగాలన్నారు. సమక్క–సారలమ్మ ట్రైబల్ వర్సిటీ వీసీ ప్రొ.వైఎస్ శ్రీనివాస్, ప్రొ.దీపక్ కుమార్, ప్రొ.అమరేశ్వర్, ప్రొ.హరిప్రసాద్ ప్రసంగించారు.

గాంధీలో బ్రెస్ట్‌ఫీడింగ్ ర్యాలీ

గాంధీఆస్పత్రి : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని సికింద్రాబాద్ గాంధీ చిన్నపిల్లల విభాగం, ఐఏపీటీసీబీ ఆధ్వర్యంలో గురువారం బ్రెస్ట్ ఫీడింగ్ ర్యాలీతోపాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తల్లిపాలలో అన్ని రకాల పోషకాలు, ఔషధగుణాలు ఉంటాయని, శిశువు ఎదుగుదలలో ముర్రుపాల పాత్ర కీలకమన్నారు. రోగనిరోధకశక్తిని పెంచుతుందని, పుట్టిన మొదటి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టాలని సూచించి, అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ప్రాంగణాల్లో ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడియాట్రిక్ హెచ్‌ఓడీ వాసుదేవ్, వైద్యులు జార్జ్, సత్యనారాయణ, గైనకాలజీ ప్రొఫెసర్ జానకి వెల్లంకి, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ–1 శేషాద్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, ఆర్ఎంఓ సుధార్‌సింగ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, పీజీలు

ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ సేవలు అమోఘం



శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు

గాంధీఆస్పత్రి : గాంధీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ పారిక శ్రవణ్‌కుమార్ అందించిన అమోఘమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. గాంధీలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై అడిషనల్ డీఎంఈ, సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన శ్రవణ్‌కుమార్‌కు గురువారం గాంధీ అలుమ్నీ భవనంలో వీడ్కోలు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగానికే వన్నె తెచ్చిన శ్రవణ్‌కుమార్ మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సహనం, ఓర్పు, చిత్తశుద్ధి, ఇష్టంతో విధులు నిర్వహించే విజయం సాధించవచ్చని, కనాన పాండమిక్ సమయంలో గాంధీ సూపరింటెండెంట్‌గా, కోవిడ్ స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా మెరుగైన సేవలు అందించిన శ్రవణ్‌కుమార్ వేలాది మందికి పునర్జన్మ ప్రసాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొ.పాండురంగారావు, ఆర్ఎంఓ–1 శేషాద్రి, శ్రవణ్‌కుమార్ తండ్రి ధనుంజయ, వైద్యులు సునీల్‌కుమార్, రమేష్, రామన్న, అభిలాష్, భరణీ, ఈశ్వర్, రమాకాంత్, వెంకటేష్ రోమన్, పీజీలు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'షైన్' ఓపెన్ డే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భారతీ కులకర్ణి



సైంటిస్టులతో మాట్లాడుతున్న విద్యార్థులు

లాలాపేట: తార్నాకలోని ఐసీఎంఆర్–జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)లో గురువారం సైన్స్, హెల్త్ ఇన్నోవేషన్ ఫర్ నెక్స్ట్‌జెన్ ఎక్స్‌ప్లోరర్స్(షైన్) ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పిల్లల్లో ఆరోగ్యం పరిశోధన కార్యకలాపాలు, ఆవిష్కరణల గురించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో భవిష్యత్ ఆరోగ్య శాస్త్రవేత్తలుగా తయారు కావాలనే ఉద్దేశంతో నిర్వహించిన షైన్ కార్యక్రమానికి నగరంలోని 22 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన దాదాపు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోజంతా ఎన్ఐఎన్‌లో జరుగుతున్న పరిశోధనలు స్వయంగా తిలకించడంతో పాటు అక్కడి శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడుతూ గడిపారు. ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతీ కులకర్ణి మాట్లాడుతూ.. ఆరోగ్య శాస్త్రంపై ఆసక్తి పెంచుకుని భవిష్యత్‌లో హెల్త్ సైంటిస్టులుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిస్టులు డా. సుబ్బారావు, డా. మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

19న సోషలిస్టు ప్రతినిధుల సభ

పంజగుట్ట: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టం తీసుకురావాలని సోషలిస్ట్ కూటమి రాష్ట్ర కార్యదర్శి సింగం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన గన్‌ఫౌండ్రీలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో సోషలిస్టు ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ కరపత్రాన్ని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యదర్శి జైబాబు, జాతీయ కార్యదర్శి ఎస్.రాజు, కూనపురెడ్డి ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రైవేట్ రంగం 90 శాతం ఉంటే ప్రభుత్వ రంగం కేవలం 10 శాతం మాత్రమే ఉందని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంవల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎంతో నష్టపోతున్నారన్నారు.

దుర్గంధం... దుర్భరం

నిత్యం డ్రైనేజీ మురుగునీటి సమస్య కారణంగా నరకం అనుభవిస్తున్నామని అడ్డగుట్ట వాసులు వాపోతున్నారు. బస్టాండ్ నుంచి అడ్డగుట్ట కమ్యూనిటీహాల్‌కు వెళ్లే మార్గంలో కొన్ని నెలలుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురుగు పారుతుండటంతో ఈగలు, దోమలు వృద్ధిచెంది సాయంత్రం అయిందంటే దోమలతో కంటిమీద కునుకు కరవవుతోందని వాపోతున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. – అడ్డగుట్ట



అడ్డగుట్టలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్





ఇళ్ల ముందు పారుతున్న మురుగు